# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. విదేశీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఆస్ట్రియాలో పర్యటిస్తున్నారు.
2. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలకు తీసుకుంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
3. రాష్ట్ర ప్రభుత్వం తాగు, సాగునీటికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
4. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటిస్తారు.
5. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు తుది దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ తెలిపింది.

==========================

విదేశీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఆస్ట్రియాలో పర్యటిస్తున్నారు. ఆస్ట్రియా పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ దేశ వైస్ ఛాన్సలర్ కార్ల్ నెహమ్మెర్‌తో ఈ రోజు సమావేశమైయ్యారు. భారత్-ఆస్ట్రియా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు రాబోయే కాలంలో మరింత బలపడతాయని, ప్రపంచ ప్రయోజనాల కోసం ఇరు దేశాలు కలిసి పని చేస్తూ ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. కాగా అంతకుముందు ప్రధానమంత్రికి వియన్నా విమానాశ్రయంలో ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆస్ట్రియా దేశ వ్యాపారవేత్తలతో, భారత సంతతి వ్యక్తులతో ఈ రోజు వియన్నాలో సమావేశమవుతారు.

--------------------------

మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలకు తీసుకుంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. వైయస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మాదక ద్రవ్యాల వినియోగంపై మంత్రి లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల తల్లిదండ్రులతో మంత్రి ఈ రోజు అమరావతిలో సమావేశమైయ్యారు.మాదక ద్రవ్యాల సమస్యను పరిష్కరిస్తామని, ఇప్పటికే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. గంజాయిని ప్రోత్సహించే స్థానిక రాజకీయ నాయకులపైనా కఠిన చర్యలకు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం తాగు, సాగునీటికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటిని మంత్రులు పార్థసారథి, కొల్లు రవీంద్రలతో కలిసి ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ , డెల్టా రెగ్యులేటర్ నుంచి మూడు గేట్లు తెరిచి 500 క్యూసెక్కులను విడుదల చేశామన్నారు. పట్టిసీమ లిఫ్ట్ నుంచి వచ్చిన నీళ్ళు కృష్ణా డెల్టాలో సాగు, తాగు నీటికి ఉపయోగ పడతాయని తెలుపుతూ,

వాయిస్ (16 సెకన్లు )

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఉత్తరాంధ్రలోని అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను పరిశీలిస్తారు. అనంతరం విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోను చేరుకుని దృశ్యమాధ్యమ విధానంలో సీఐఐ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకుని ఆ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తిరిగి ప్రత్యేక విమానంలో విజయవాడకు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్- బీపీసీఎల్ రిఫైనరీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయనుందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి తెలిపారు. విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను బీపీసీఎల్ ప్రతినిధులతో కలిసి ఎంపీ ఈరోజు దర్శించుకున్నారు. దర్శనానంతరం బౌలశౌరి పాత్రికేయులతో మాట్లాడుతూ, కూటమి పార్లమెంట్ సభ్యుల చొరవతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. బీపీసీఎల్ రిఫైనరీ ద్వారా సుమారు 25 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొంటూ,

వాయిస్ (18 సెకన్లు)

---------------------------

వెనుకబడిన తరగతి వర్గాల జీవన ప్రమాణాలను పెంపొందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్ ను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో బీసీ సామాజిక భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు తుది దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పాలిసెట్- 2024లో అర్హత పొంది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం రేపటి నుంచి దరఖాస్తు

చేసుకోవాలని సూచించారు. రేపటి నుంచి జులై 14 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధృవపత్రాల పరిశీలన, ఐచ్ఛికాల నమోదు ప్రక్రియకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 16న సీట్లు కేటాయిస్తామని తెలిపారు.మరిన్ని వివరాల కోసం పాలిసెట్ అధికారిక వెబ్ సైట్ ని వీక్షించవచ్చని తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి ఈనెల 16న రాష్ట్ర సచివాలయంలో సమావేశం కానుంది. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్సుకు ఆమోదంతో పాటు, ఇతర కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మంత్రి మండలి సమావేశంలో చేర్చాల్సిన అంశాలకు సంబంధించిన సమాచారం రేపు సాయంత్రంలోగా అన్ని ప్రభుత్వశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు సాధారణ పరిపాలన విభాగానికి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై తిరుపతి గ్రామీణ మండలం మంగళంలో ఈరోజు అవగాహన ర్యాలీని నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి మణి ప్రసాద్‌లు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం రానున్న నేపథ్యంలో అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు పారిశుధ్యంపై స్టాప్ డయేరియా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలుపుతూ

వాయిస్ (31 సెకన్లు)

---------------------------

ఈరోజు జాతీయ మత్స్యరైతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సూర్యోదయం కాకముందే సముద్రంలో, నదుల్లో చేపల వేటకు వెళ్ళి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా చేపలు పట్టి తమ బ్రతుకు తెరువు చూసుకుంటున్న మత్స్యకారుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ... ప్రతి ఏటా జులై 10వ తేదీని మత్స్య రైతుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. మత్స్య ఉత్పత్తులు కోట్లాది మందికి ఉపాధి చూపడమే కాకుండా వేల కోట్ల రూపాయల మేర విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మత్స్యరంగ అభివృద్ధికి 2015 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం "నీలి విప్లవం" పేరుతో ఒక పథకాన్ని కూడా ప్రారంభించి అనేక చర్యలు తీసుకుంది. మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలుస్తున్నాయి.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 28 సెకన్లు....

---------------------------

కేంద్రప్రభుత్వ సహకారంతో చిత్తూరు పార్లమెంటు పరిధిలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని

చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ తెలిపారు. చిత్తూరులో ఈరోజు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేలా యువతను ప్రోత్సహిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

---------------------------

తెలుగు, ఆంగ్ల సాహిత్య రంగంలో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ గూటాల కృష్ణమూర్తి జయంతి ఈ రోజు. 1928వ సంవత్సరం జులై 10వ తేదీన ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాలోని పర్లాకిమిడి గ్రామంలో జన్మించారు. తెలుగు, ఆంగ్ల భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఇంగ్లాండ్లో ఆంగ్ల భాషా ప్రొఫెసర్‌గా పనిచేశారు. "జుబ్బా లేని అబ్బాయి" రచన ఆయనకు మంచి పేరు తెచ్చింది, ఆంగ్ల సాహిత్యానికి విశేష సేవలు అందించిన తెలుగు తేజంగా గూటాల కృష్ణమూర్తి పేరు తెచ్చుకున్నారు. గాంధేయ వాది అయిన కృష్ణమూర్తి 2016వ సంవత్సరం జులై 13వ తేదీన తుది శ్వాస విడిచారు.

======================